# మనస్సును నిగ్రహించినవాడే మాధవుని చేరగలడు

దినకరుడు శాంతుడై తోచె దినములింక కురచనయ్యె
చలిగాలి చురుకు హెచ్చె
పొలములన్ రేయి గ్రుడ్డి వెన్నెలలోన
కుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి పదములన్ పాడదొడగిరి
పచ్చపూలు జనపచేలకు ముత్యాల సరులుగూర్చె
మిరప పండ్లకు కుంకుమ మెరుపు రాల్చి
బంతిపువ్వుల మొగములల్లంత విప్పి
మన గృహంబుల ధాన్యసంపదలు నిల్పి
సరసురాలైన పుష్యమాసంబు వచ్చె
సరసురాలైన సంక్రాంతి పండుగొచ్చె

ప్రేమస్వరూపులారా!

భారతీయ పర్వదినములన్నియు విచిత్రమైన, అంతర్భావముతోకూడిన, అంతరార్థముతోకూడిన ఆనందసౌధములేగానీ కేవలము ఆడంబర దృష్టివికావు. ప్రతి పర్వదినమునకు ఒక అంతరార్థము, అద్భుతమైన విశిష్టత ఉండి భౌతికమైన మార్పులతోకూడిన ఆనందమును చేకూరుస్తూవస్తున్నవి. సూర్యుడు ప్రతినెల ఒక రాశియందు ప్రవేశిస్తూ ఉంటాడు. 12 నెలలకు 12 రాశులలో ప్రవేశిస్తుంటాడు. ఇందులో ప్రధానమైన రాశులు నాలుగు. మొదటిది మకర సంక్రమణము, రెండవది కర్కాటక సంక్రమణము, మూడవది తులా సంక్రమణము, నాల్గవది మేష సంక్రమణము. ఈ

srisathyasaivahini.org

నాల్గింటియందు ప్రధానమైనది, మకర సంక్రమణము. ఈ మకర సంక్రమణము అనేక విధములైన భౌతిక, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, దివ్యమైన సంగతులతోకూడి ఉంటున్నది. ఈ సంక్రమణమునందు సూర్యుడు దక్షిణమునుండి ఉత్తరమునకు ప్రయాణమవుతుంటాడు.

**ఉత్తరాయణమనగా బుద్ధిని అంతర్ముఖముగా మరల్చుటమే!**

ఉత్తరదిశ అనగా ఏమిటి? మోక్షదాయక స్థానమునే ఉత్తరదిశ అంటారు. హిమ+అచలం=హిమాచలం. ఏమిటి ఈ హిమాచలము? హిమమనగా పరిశుద్ధము. హిమమనగా పరిపూర్ణమైన తెల్లదనము. ఆచలమనగా సుస్థిరము. ఈ పరిశుద్ధమైన హిమము, ప్రశాంతమైన హిమము, అచలమైన స్వరూపమును ధరిస్తూ ఉంటుంది. ఏమిటి? ఆ స్థానము. అదియే హృదయస్థానము. హృదయము నిర్మలముగా నిశ్చలముగా ప్రశాంతమైన స్థితియందు ఉన్నప్పుడు ఈ సూర్యుడనే బుద్ధి ఇందులో చక్కగా ప్రవేశిస్తాడు. మనము ఎక్కడనో బాహ్యమైన, భౌతికమైన ప్రయాణములు చేయనక్కరలేదు. ఉత్తరాయణ ప్రయాణమనగా మనయొక్క బుద్ధిని అంతర్ముఖముగా మరల్చుటమే. హృదయము దిశకు దీనిని పంపటమే, ఈ అంతర్ముఖమైన ఆనందమే మానవునికి నిజమైన ఆనందము. బాహ్యమైన, లౌకికమైన, ప్రాకృతమైన ఆనందములు అస్థిరములు. కేవలము క్షణభంగురమైనవి. నిత్యము, సత్యము, నిర్మలమైన ఆత్మతత్త్వమై నిరంతరము అక్షయమై, అమరమై, అనంతమై ఉంటుంది. దీనినే మోక్షసదనము అన్నారు. దీనికి చేసే ప్రయాణమే మోక్షసాధకము అన్నారు.

**మానసిక, శారీరక శాంతులు సంక్రాంతి పర్వదినమునందు లభిస్తాయి**

సంక్రాంతి అనగా అంతర్ముఖమైన దృష్టిని, నిర్మలమైన హృదయాన్ని, పరిశుద్ధమైన తత్త్వమును ప్రబోధించే కరణమే సంక్రమణము. సూర్యుడు ఏ విధముగా ఉత్తరముఖమునకు ప్రయాణమవుతున్నాడో అదే విధంగా బుద్ధిని ఆత్మవైపు మరల్చి దీనిని అటువైపునే ప్రయాణము సల్పాలి. ఈ ఉత్తరాయణ కాలమునే పవిత్రమైన కాలమని ప్రబోధిస్తూ వచ్చింది, వేదము. ఇట్టి పవిత్రదినమునకై 56 దినములు శరతల్పముపై పవళించి భీష్ముడు కాచి ఉన్నాడు. ఈ పవిత్ర



srisathyasaivachanamrutam

కాలమున మరణించిన ప్రతివ్యక్తి దివ్యత్వము పొందగలడని మన పురాణముయొక్క ప్రబోధలు. సంక్రమణమనగా సూర్యుడు ఒక్కొక్క నెల ఒక్కొక్క రాశియందు ప్రవేశిస్తూ ఉంటాడు. ఈ పండ్రెండు రాశులందు మకరరాశి చాలా ముఖ్యమైనది. మకర సంక్రాంతి శాంతిని, క్రాంతిని ప్రబోధిస్తుంది, అందిస్తుంది. దీనిని ప్రాకృతముగా విచారము చేసినప్పుడు ఆంగ్లసంవత్సరమునందు జనవరి 13, 14 తేదీలందు ఈ సంక్రాంతి ప్రారంభమవుతుంది. ఇది ఒక విధమైన శారీరక, మానసిక శాంతి, విశ్రాంతిని చేకూరుస్తుంది. ఈ నెలలో భూమిని ఆధారము చేసుకొన్న రైతు విశ్రాంతిగా వుంటాడు. ఏ విధమైన పనులు లేక విశ్రాంతిగా తన గృహములో పండించిన పంటను భుజించి ఆనందమును అనుభవిస్తుంటాడు. నిజముగా కర్షకులకు ఈ నెల తప్ప మరొక నెల విశ్రాంతి చిక్కదు. సకల సంపదలు వారు గృహములో చేర్చుకుంటారు. నవధాన్యములు పండించి తమ గృహమును నింపుకుంటారు. నవధాన్యములచేత గృహమును నిండించుకున్నప్పుడు మనస్సును పండించుకుంటారు. కనుక, మానసిక శారీరక శాంతులు ఈ సంక్రాంతిలో అభివృద్ధి అవుతూ ఉంటాయి. ఈ సంక్రాంతి అనే పదమునందే ఎంతయో అంతరార్థమున్నది. అయితే మానవుడు ఈ అంతరార్థమును గుర్తించుకొనలేక భారతీయుల ప్రాచీన సంస్కృతిని, పవిత్రమైన పర్వదినముల అంతరార్థమును విస్మరించి భౌతికమైన, లౌకికమైన క్రియలచేతనే సంతృప్తి పడుతున్నాడు.

**మోహక్షయమే మోక్షము**

ఎంతకాలము భౌతికమైన ఆనందమును అనుభవించినప్పటికిని నిత్యసత్యమైన ఆనందము మనకు లభ్యముకాదు. వెతికి వెతికి తనయందే ఉన్న తత్త్వమును తాను అర్థము చేసుకున్నప్పుడే, ఆ నిజతత్త్వము తనకు అర్థమవుతుంది. ముక్కుపై పెట్టుకున్న అద్దములు ఇల్లంతా వెతికి కట్టకడపటికి 'అయ్యో! అద్దములు నాముక్కుపైనే ఉన్నవే', అని ఆనందమును అనుభవించినట్లుగా ఈనాడు ప్రతిమానవుడు తనయందే ఉండిన నిత్యానంద, పరమానంద, యోగానంద, అద్వైతానందముల తత్త్వాన్ని అనంతమార్గములలో వెతకి కట్టకడపటికి తనయందే ఉన్నదనే సత్యాన్ని గుర్తింపచేయునదే ఈ సంక్రాంతి. మనము ఆశించే ఆనందము ఏ పరదేశమునందో, ఏ బయట ప్రదేశమునందో లేదు. తనయందే అట్టి

sri sathyasai vachanamrutam

ఆనందముంటున్నది. దేవుడు ఏ దేశమునందోలేడు. ఏ పర్వతమునందో లేడు. ఏ వైకుంఠకైలాసస్వర్గమునందో లేడు. తన హృదయమే పవిత్రమైన మందిరము. బహిర్దృష్టిని అంతర్దృష్టిగా మార్చుకొనుటకు ఏ మానవుడు ప్రయత్నించునో వాడే ధన్యుడౌతాడు. ఆ ధన్యతను పొందినవాడే మోక్షమును పొందుతాడు. అంతవరకు ఈ మానవునకు మోహము తప్పినదికాదు. మోహము ఉండినంతవరకు మోక్షము చిక్కదు. మోక్షమనగా ఏదో ఒక ప్రత్యేకమైన ప్రదేశముకాదు. 'మోహక్షయం మోక్షం' అన్నారు. మోహము బాహ్యదృష్టివలనే బలపడుతూ వస్తున్నది. ఏ మానవుడు అంతర్దృష్టిని అలవరచుకొనునో ఆనాడే ఈ బహిర్దృష్టి అనే చంచలము చల్లారుతుంది. అయితే ఈనాటి మానవుడు అనేక సాధనలు సల్పుతున్నాడు. నవవిధమైన మార్గములందు ప్రవేశిస్తున్నాడు. కానీ ఎన్ని విధములైన మార్గములలో ప్రవేశించినప్పటికిని తనకు లభించవలసిన స్థానము, తాను అనుభవించవలసిన స్థానము తాను ఆనందించవలసిన స్థానము తనయందే ఉన్నదనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు.

**బాహ్య సాధనలన్నీ తాత్కాలికానందమును చేకూర్చునవే!**

బాహ్య సాధనలన్నీ కేవలం అప్పటికప్పుడు ఆనందమును చేకూర్చునవే! భజనలు చేసే సమయంలో వినేంతవరకు ఆనందముగా ఉంటుంది. భజన ముగియగానే ఆనందముకూడా నిలచిపోతుంది. ఈ బాహ్య చర్యలలో ఏర్పడే ఆనందము బాహ్యముగానే ఉంటుంది. భజనలు చేయకూడదని కాదు. మనము ఏ సాధనలు చేసినప్పటికిని వాటిని అంతర్ముఖముగా మార్చుకొనుటకు తగిన కృషి చేయాలి. జపములు చేస్తారు, ధ్యానము చేస్తారు. ఇవన్నీ దేహమునకు సంబంధించినవేగానీ హృదయమునకు సంబంధించినవి కాదు. ప్రతి మానవుడు సాధనలన్నీ మనసుద్వారానే చేస్తున్నాడు. మనస్సు స్థిరమైనదికాదు 'చంచలం హి మనః కృష్ణ ప్రమాది బలవదృఢం'. మహాచంచలమైనది, మహాప్రమాదమైనది, మహాదృఢమైనది మనస్సు. ఇట్టి మనస్సుతో చేసిన సాధనలు హృదయమును ఏ రీతిగా చేరగలవు? తాత్కాలిక తృప్తిని అందించి తనలో ఆవేశించిన వేడిని చల్లారుస్తుంది. సాధనలు ఏవీ శాశ్వతమైన ఆనందమును చేకూర్చలేదు. సర్వసాధనలు బహిర్ముఖముగా ఆచరించేవే! అవే నవవిధమార్గములు

srisathyasaivacharamrutam

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

కట్టకడపటికి ఒక్కటే శాశ్వత ఆనందమును చేకూరుస్తుంది. అదే ఆత్మనివేదనం. ఇది సాధించిన తరువాత మరొకటి దగ్గర చేరదు. సర్వము అందులోనే మిళితమై ఉంటున్నది. అట్టి అంతరతృప్తి ప్రబోధించే నిమిత్తమే ఈ సంక్రాంతి ప్రారంభించింది.

## ఆత్మతత్త్వమును వ్యక్తీకరింపజేయునదే సంక్రాంతి

సంక్రాంతి కుటుంబమునకు సంబంధించినదని సుబ్బారావు చెప్పాడు. నిజమే ఇది కుటుంబమే! వసుధైక కుటుంబము. యావత్ప్రపంచము ఒక కుటుంబము. ప్రపంచమునకు సంబంధించినది ఇది. భార్య, భర్త, కొడుకులు, కోడళ్లు, మనుమలు, ఇలాంటివారికి మాత్రమే పరిమితము కాదు. సర్వమానవజాతికి సంబంధించినది, ఈ సంక్రాంతి. వారికి తెలిసినను తెలియకపోయినను ఇది అంతర్భావాన్ని చేకూర్చి నిజమైన ఆనందాన్ని కలిగింప చేస్తుంది. తెలిసి ముట్టినా, తెలియక ముట్టినా అగ్ని ఏ విధముగా కాల్చునో ఆ విధంగా సంక్రాంతి మహాత్యము గుర్తించినను గుర్తించకపోయినను ఆ సంక్రాంతి సర్వులకు అనుభూతి చేకూరుతుంది. మానసిక పరివర్తన గావించేదే సంక్రాంతి. ప్రవర్తనను మార్చునదే సంక్రాంతి. పవిత్రమైన ప్రకాశము అందించునదే సంక్రాంతి. అంతర్భావమునందు చేకూరిన సమస్తశక్తులు బహిర్ముఖముగా ఆవిర్భవింపచేయునదే సంక్రాంతి. గుప్తమై అంతర్గతమై అగోచరమై ఉండిన ఆత్మతత్త్వమును వ్యక్తీకరింప చేయునదే సంక్రాంతి. ఇట్టి అనంతమైన అంతరార్థముతో కూడినది ఈ సంక్రాంతి. ఇది మనస్సుతోబాటు ప్రకృతినికూడా ఇందులో ప్రవేశపెడుతుంది.

## జగత్తంతా మనస్సుయొక్క స్వరూపమే

ప్రకృతికి, మనస్సుకు భేదములేదు. మనసుయొక్క ప్రభావమే ప్రపంచము. అంతా 'మనోమూలం మిదం జగత్'. జగత్తంతా మనస్సుయొక్క స్వరూపమే. మనసు లేక జగత్తులేదు. సర్వం మనోమయంగా ఉంటున్నది. అట్టి మనస్సును హృదయంవైపు మరల్చి దివ్యత్వముపైన ఇమిడ్చి దివ్యకాంతిలో మనము చింతించినప్పుడే ఈ మనస్సు ప్రభావము

sri sathyasai vachanamrutam

మనలను ఏమీ బాధించకుండా ఉంటుంది. అయితే మనస్సునందు ఇన్ని విధములైన సంకల్పములు కలుగుటకు మూలకారణం ఏమిటి? ఇంద్రుని జయించినవాడైనా ఇంద్రియాల్ని జయించకపోతే వాడు అల్పుడే! ఇంద్రుడనగా ఎవరు? ఇంద్రియములకు అధిపతియే ఇంద్రుడు. ఇంద్రియములకధిపతి ఎవరు? మనస్సే. కాబట్టి మనస్సే ఇంద్రుడు. అటువంటి ఇంద్రుని మనయందే ఉంచుకొని ఎక్కడో బయటనున్న ఇంద్రునితో యుద్ధము చేస్తే వచ్చిన ఫలితము ఏమిటి? కనుక మొట్టమొదట మనోనిగ్రహము కావాలి. మనస్సు నిగ్రహించినవాడే మాధవుని చేరగలడు. ఈనాటి యువకులందు అనంతముగా అభివృద్ధి అయ్యే దుర్భావములు, దుశ్చింతలు, దురాలోచనలు, దుస్సంగముయొక్క ప్రభావములే దీనికి మూలకారణము. యువకులు, యువతులు ఈ విషయాన్ని చక్కగా గుర్తించాలి. మనలో ఆవిర్భవించే దుర్భావములకు, దుశ్చింతలకు, దుఃఖములకు, దురాలోచనలకు, దుశ్చర్యలకు ఎవరు కారణము? చక్కగా లోతుకు దిగి ఆలోచించండి. అన్నింటికి మూలకారణము ఆహారమే! ఆహారముచేత మనస్సుయొక్క భావములు అనంతముగా రూపొందుతూ వచ్చాయి. బయటనున్న ప్రకృతి మనస్సును ఆకర్షిస్తుంది. దీనికి సరైన దృష్టాంతము మీకు కావాలనుకున్నప్పుడు నిత్యజీవితములో ఈనాటి యువకులు, యువతులు అనుభవించే ఆనందములోనే అంతరార్థము మీరు గుర్తించుకోవచ్చు.

**భోజనము చేసే సమయములో నిశ్శబ్దముగా ఉండాలి**

ప్రతి ఇంటియందు ఈనాడు టీవిలున్నవి. ఇంకా శ్రీమంతులు కలర్‌టీవిలు పెట్టుకుంటారు. ఇంకా శ్రీమంతులు స్టార్‌టీవిలు పెట్టుకుంటారు. కేవలము డ్రాయింగ్‌రూములోనేకాదు, డైనింగ్‌హాలు, బెడ్‌రూములోకూడా పెట్టుకుంటారు. ఈ టీవిలు ఏనాడు ప్రపంచములో ప్రారంభమైనవో ఆనాడే మానవుని మనస్సు మాలిన్యమైపోయింది. మీరు చక్కగా యోచించండి. టీవిలు రాకమునుపు మన మనోదౌర్బల్యము ఇంతగా ఉండేదికాదు. మనసునందు దుర్భావములు ఇంత అధికంగా కలిగేవికాదు. ఇవి ప్రారంభించకమునుపు ఇటువంటి దుశ్చర్యలు కనివిని ఎరుగము. ఎక్కడో నూటికి ఒక్కరో,

sri sathyasai vahamrutam

కోటికి ఒక్కరో వుండేవారు. ఈనాడు చిన్న చిన్న గుడిసెలందు టీవిలు ప్రారంభమైనాయి. ఆ టీవిలు ఏ విధమైన మార్పులు తెస్తున్నాయి? భోజనము చేసే సమయములో డైనింగ్‌హాలులో ఎదురుగా ఈ టీవిలు పెట్టుకుంటారు. దాన్ని చూస్తూ భుజిస్తుంటారు. భుజించేది ఆహారము కాదు. టీవిలో వచ్చే మాలిన్యమే వీడు భుజిస్తున్నాడు. ఆ దృష్టి అంతయు దానిపైనే. ఆ దృష్టిచేతనే సృష్టి మార్పు అయిపోతున్నాది. ఎలాంటి చర్యలు, దృశ్యములు, భావములు మనము చూస్తున్నామో అలాంటి దృశ్యములు, భావములు, దుశ్చర్యలే మనలో ప్రవేశిస్తున్నాయి. మనలో తెలియని రీతిలో ఆవేదనలు, అవేశములు అనేకం అభివృద్ధి అవుతున్నాయి. అది నీకు తెలియదు. నేను ఏనాడు చింతించలేదే యిటువంటి భావాలు, నాకు ఎందుకు రావాలని విచారిస్తాడు. కానీ ఈ దుశ్చర్యలు, దుర్భావములు, దురాలోచనలు ఈ టీవిలో చూసిన దృశ్యముల బీజములే మన హృదయములో నిల్చిపోయినాయి. అవన్నీ సమయాన్ని పురస్కరించుకొని మొక్కలుగా వచ్చి నీలో యిలాంటి భావాలన్నీ అభివృద్ధి పరుస్తున్నాయి. మనం భుజించే సమయంలో భయంకరమైన విషయములు మాట్లాడకూడదు. ఉత్తేజకరమైన విషయములు చింతించకూడదు. మనం భోజనం చేస్తూ ఒకరితో ఒకరు వాదోపవాదములు చేయకూడదు. భోజనము చేసే సమయములో కేవలము నిశ్శబ్దముగా ఉండాలి. ఈ మాటల తరంగములు మన హృదయములో ప్రవేశిస్తున్నాయి. ఎలాంటి భావములు, తరంగములు ప్రవేశిస్తున్నాయో అలాంటి ఊహలే మనలో ఆవిర్భవిస్తున్నాయి. కనుక ఇలాంటి తరంగములు ఆవిర్భవించకుండా చూచుకోవాలి. స్టార్‌టీవిలు వచ్చాయి. మనిషిని పూర్తి మసి చేస్తున్నాయి. మాణిక్యమువంటి మానవజీవితాన్ని మసిబొగ్గులకు అమ్ముకుంటున్నారు. ఇది ప్రశాంతినందిస్తున్నాదని భావిస్తున్నారు. కాదు కాదు. తాత్కాలికమైన ప్రశాంతినిస్తున్నది. చూచి ఆనందిస్తున్నావు. తదుపరి నీలో ప్రవేశించి ఎన్ని విధాల తిప్పలు పెడుతున్నాయో తెలీదు. ఇది తేనె పూసిన కత్తివంటిదిగా ఉంటున్నది. తేనెకదా అని నాకుతూ పోతుంటే నాలికనే కోసివేస్తుంది. ఇలాంటి దృశ్యములంతా యువకులందు, యువతులందు ప్రవేశించటంచేత యీనాడు భారతదేశమేకాదు యావత్ప్రపంచమంతా అల్లకల్లోలముగా ఉంటున్నది. అశాంతిమయంగా ఉంటున్నాది. కేవలం అవేశమయంగా

sri sathyasai vachanamrutam

వుంటున్నవి, ఉద్రేకమయంగా వుంటున్నాది. ఉత్సాహము ఎక్కడా కనిపించటంలేదు. ఉత్సాహముగా ఉండినట్లు నటిస్తున్నాడేగానీ అది ఉత్సాహము కాదు. 'ఏమండి బాగున్నారా!' అని నవ్వటం, అది కేవలం ఒక సినిమానవ్వు. లోపల బాధ ఉంటున్నాది.

**పవిత్రమైన భావములతో జీవితమును పోషించుకొనుటే పర్వదినముల అర్థము**

ఈనాడు బాధలులేని మానవుడు ఎక్కడా కనిపించటంలేదు. జీవితమంతా దుఃఖమయంగా ఉంటున్నాది. ఒకటి, రెండు దుఃఖములుకాదు. అన్నీ దుఃఖములుగానే రూపొందుతున్నాయి. అన్నీ చింతామయంగా ఉంటున్నాయి.

**పుట్టుట ఒక చింత భూమి నుండుట చింత**
**సంసార మొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్థక్య మొకచింత**
**జీవించు టొకచింత చెడుపు చింత**
**కర్మలన్నియు చింత కష్టంబు లొకచింత**
**సంతస మొక చింత వింత చింత**
**సర్వచింతల బాపెడు సాయి భక్తి**
**కొనుడు ఇకనైన జనులార కోర్కెమీర**
**ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు**
**సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార!**

ఇన్ని చింతలు గల్గిన చింతచెట్టుపై కూర్చొని సంతోషంగా ఉండాలంటే ఎక్కడ సంతోషము? ఇదంతా పులుపుతోకూడిన చెట్టు. ఇలాంటి దానిలో జీవిస్తూ సంతోషము కావాలంటే ఎక్కడనుంచి వస్తుంది? వీలేకాదు. ఈనాడు మనము మార్చుకోవలసింది ఏమిటి? మన దృష్టిని, శ్రవణాన్ని, మాటలను సరైన మార్గములో ప్రవేశపెట్టాలి. అదే నిజమైన సంక్రమణమునకు సరైన అర్థము. మనలో ఎట్టి పరివర్తన లేక ఎన్ని సంక్రాంతులొచ్చి ఏమి ప్రయోజనము? ఈ సంక్రాంతిలో అరిసెలు తింటారు. ఆ తినేంతవరకే తీపి, తదుపరి చేదుగా మారిపోతుంది. అరిసెలతో వచ్చేదికాదు, ఆనందము. పాయసము,

srisathyasaivachanamrutam

పరమాన్నములతో కాదు పర్వదినములు. పవిత్రమైన భావములతో మన జీవితాన్ని పోషించుకొనుటే మన పర్వదినముల అర్థము. ప్రతి పర్వదినమునకు ఒక అంతరార్థముంటున్నది.

**మనిషి స్వతంత్రమును అనుభవించు, మృగ స్వతంత్రమును కాదు**

చాలామంది యువకులు, యువతులు అనుకుంటారు. 'మానవునిగా పుట్టి స్వతంత్రముగా లేకపోతే ప్రయోజనము ఏమిటి?' అని. చిన్న చేప నీటిలో స్వతంత్రముగా జీవిస్తున్నాది. చిన్న పక్షి ఆకాశములో స్వతంత్రముగా సంచరిస్తున్నాది. అడవిలో పుట్టిన ప్రతి మృగము స్వేచ్ఛగా సంచరిస్తున్నాది. మానవునికి ఎందుకు స్వాతంత్ర్యముండకూడదు, ఎందుకు స్వాతంత్ర్యముగా సంచరించకూడదు', అని యువకులందు ప్రశ్నల వర్షము అధికంగా ఉంటున్నది. నిజమే! చేపలు, పక్షులు, మృగములు స్వతంత్రముగా ఉంటున్నాయి. కానీ, ఏ విధమైన స్వాతంత్ర్యమును అనుభవిస్తున్నాయి? చేప, చేప స్వాతంత్ర్యమును అనుభవిస్తున్నది. మృగములు, మృగస్వతంత్రమును అనుభవిస్తున్నాయి. పక్షులు, పక్షి స్వతంత్రమును అనుభవిస్తున్నాయి. నీవు మనిషి కాబట్టి మనిషి స్వతంత్రాన్ని అనుభవించు; మృగ స్వతంత్రమును అనుభవించవద్దు. నేను మనిషి అని చెప్పుకుంటూ మృగమువలె సంచరించటం నిజమైన స్వాతంత్ర్యమేనా? నీవుకూడా మనిషి స్వతంత్రమును అనుభవించు. మృగముగా స్వతంత్రమును అనుభవించవద్దు. మృగస్వతంత్రము చాలా ప్రమాదము. మృగములు అనుభవిస్తున్నాయని మనము అనుభవిస్తే మనము మృగముగానే తయారౌతాము. మనిషికి ఉండవలసిన స్వతంత్రము మనిషి స్వతంత్రమే. మనిషి స్వతంత్రము ఏమిటి? కొన్ని పరిమితులుంటున్నాయి మనిషికి. సత్యమార్గములో ప్రవేశించాలి. ధర్మాన్ని అనుసరించాలి. ప్రేమను పెంచుకోవాలి. శాంతితో జీవించాలి. అహింసను సాధించాలి. ఈ ఐదింటిలో నీవు స్వతంత్రమును అనుభవించు. ఇదియే పంచభూతముల పరతత్త్వము.

**ప్రపంచమంతా పంచభూతముల మయమే!**

ఈ ప్రపంచమంతా పంచభూతములమయమే! పర్వతములు శిలామయము.

sri sathyasai vachanamrutam

వృక్షములు కాష్టమయము. భూమి మృణ్మయము. దేహము మాంసమయము. ఉన్నదంతా పంచభూతములే! కానీ, మన అనుకూలనిమిత్తమై, మన ఆనందనిమిత్తమై కఱ్ఱను తలుపులుగాను, కిటికీలుగాని, టేబులుగాను మార్చుకుంటున్నాము. రూపములు, పేర్లు వేరుగాని అది కఱ్ఱయే. ఇంక పర్వతములందు శిల, గుట్టలు, రాళ్లు అని రకరకములుగా మార్పులు చేసుకుంటున్నాము. ఏమి మార్పులు? తొక్కేది రాయి, మెట్టేది రాయి, కట్టేది రాయి, కొట్టేది రాయి. కట్టేది, మెట్టేది, తొక్కేది అంతారాయియే! తొక్కే రాయి బండ, మొక్కే రాయి విగ్రహము. కట్టేరాయి కొట్టేరాయి గుండు. అన్నీ శిలామయమే! ఈ పేర్లన్నీ మన అనుకూల నిమిత్తమై మార్చుకున్న పరికరములే! ప్రపంచములో ఉన్నదంతా పంచభూతములే! పంచభూతములకంటె మరొక భూతము ఎక్కడా కనిపించటం లేదు. ఒకవేళ మరొక భూతము ఉన్నదని వాదించుకుంటే ఉన్నది ఒక్కటే అదే అంతఃకరణ. ఇవన్నీ బహిఃకరణములు. అంతఃకరణస్వరూపమే అత్మతత్త్వము. మానవుడు తన స్వతంత్రమును తాను అనుభవించాలంటే ఈ ఐదింటికి మించి పోకూడదు. అందులోనే మనకు సరైన విజయము చేకూరుతుంది. అందులోనే మనకు తగిన ఆనందము లభ్యమవుతుంది. మానవుడు స్వతంత్రమును అనుభవించాలని ఇమిటేషన్‌గా పోకూడదు.

**నీ అంతరాత్మను నీవు అనుసరించు**

ఈ ఆధునిక యుగమందు, ఈనాటి విద్యాప్రభావమందు అనుకరణ అనే పెద్ద చెడ్డవ్యాధి ప్రవేశించింది. ఆయన డ్రైనేజ్‌పైపువంటి ప్యాంటు వేసుకున్నాడు. ఇది ప్యాషన్ అని తానుకూడా కుట్టించుకునేది. ఒకపక్క ఎరుపు, ఒకపక్క నలుపు, ఇది కలియుగ ప్యాషన్ అని. తానుకూడా అలా వేసుకోవాలి. ఇదంతా యిమిటేషన్. నీవు మనిషివి. గుడ్డిగా అన్నింటిని అనుసరించవద్దు. నీ conscience ని నీవు అనుసరించు. ఈ విధంగా మానవుడు అంతకంతకు బలహీనుడైపోతున్నాడు. ఇంకా ఎంత బలహీనుడైనాడంటే సినిమావల్ల, టీవిలవల్ల, రేడియోలవల్ల మానవుని మనస్సు పూర్తి మాలిన్యమైపోతున్నది. తన పవిత్రత ఈ పెడమార్గములవలన పూర్తిగా కలుషితమైపోతున్నాది. తనయందున్న దివ్యమైన శక్తి బలహీనమైపోతున్నాది. చిన్న ఉదాహరణము. మన ముక్కుపైన ఒక దోమ

sri sathyasai vachanamrutam

వాలింది. మొట్టమొదట అట్లాఅంటారు. మరివచ్చి వాలుతుంది. నీకు ఎంత ఓపిక ఉంటున్నాది అని, టెస్టు చేస్తున్నాది. రెండవతూరి యింకా కొంచెం గట్టిగా అంటావు. మూడవతూరి యుద్ధము చేస్తారు. ఒక్క చిన్న దోమ ఇంత పెద్ద దేహముపై వాలినప్పుడు భరించుకోలేని దుర్బలుడవయ్యావు. కేవలము నిన్ను పరీక్షించటానికి వచ్చిన దోమను భరించటానికి నీకు శక్తి లేకపోతున్నాది. ఇంత బలహీనుడా నీవు కావటము? మన పూర్వికులు ఎంత తపస్సు చేశారు! శరీరము పైన పుట్టలు పుట్టాయి. చీమలు పొర్లాడాయి. మృగములంతా సంచరించాయి. పాములు ప్రవేశించాయి. కానీ ఏమాత్రము చలించలేదు. ఇంత దృఢశక్తితో ఉండినది మానవత్వము. ఈనాడు ఎంత బలహీనమైపోయింది! ఎవరైనా ఒకరు అనరాని మాట అంటే మనము ఉండలేము. ఓర్చుకోలేము. ఎందుకంత మాత్రము శాంతము లేకపోతున్నాది? యింతమాత్రము ఓపిక లేకపోతే నీవు ఏమి సాధించగలవు? ఈనాటి యువకులకు ఓపిక చాలా అవసరము. నీవు భరించుకోవాలి. శాంతము సంపాయించుకోవాలి. శాంతము లేక సౌఖ్యములేదు. శాంతమును నీవు పోషించుకోవాలి. ఆ శాంతి ఏవిధంగా వస్తుంది? కేవలము దివ్యభావములచేత శాంతి లభ్యమవుతుంది. దీనిని భరించుకోలేకపోతే దేనినీ సాధించలేవు. ఎవడో నిన్ను దూషించాడు. దూషించాడని వానిని నీవు ఎందుకు దూషణ చేయటం? 'వాడు చెడ్డవాడు, నన్ను దూషించాడ'ంటావు. నీవుకూడా వానిని దూషిస్తే నీవు చెడ్డవాడైపోతావు. వాడు చెడ్డ అనటానికి నీకు ఎట్లా అధికారముంది? దూషిస్తే దూషించుకోనీ. 'ఈ పాంచభౌతిక దేహాన్ని నాకు నేనే దూషించుకుంటున్నాను. ఇంకా వాడుకూడా దూషిస్తే నాకు సహాయము చేసినట్లే!' అనుకోవాలి. ఈ నీటిబుడగ దేహాన్ని ఎవరు దూషిస్తే ఏమి? మనలోనున్న దోషాన్ని మనం వెతుక్కోవాలి. గట్టిగా దూషిస్తే గాలిలో చేరిపోతాయి. తనలో తాను దూషిస్తే తనకే చేరిపోతాయి. మనవరకు రానేరావు. ఎందుకు ఈ బలహీనత మనం పెంచుకోవాలి. ఈ సత్యాన్ని యువకులు చక్కగా గుర్తించుకోవాలి. వాడు ఏదో అన్నాడని వానిపై ద్వేషము పూనుకొని ఆ ద్వేషములో కక్షలు పెట్టుకొని ఆ కక్షలచేత సమాజాన్ని అశాంతి చేయకూడదు.

**మృదుమధురమైన మాటలే హృదయాన్ని చల్లబరుస్తాయి**

sri sathyasai vahamrutam

ఈనాడు పల్లెమొదలు పట్టణమువరకు అనేక పార్టీలు. కారణం ఏమిటి? ఇది ఒక పెద్ద రోగము. ఆ రోగము ప్రవేశించుటచేత అశాంతి ప్రపంచమంతా పాకిపోయింది. 'ఎవరు ఏమి అనుకుంటే నాకేమి? నాలో లేనిది అనుకుంటే నాకేమి? అది నాకు సంబంధించినదికాదు', అని ఆ నమ్మకముపైన మనము నిల్చాలి. చిన్న ఉదాహరణము. నాకు నేనే చెప్పుకుంటాను-ఎక్కడో దూరములో గ్రామములోనో, పట్టణములోనో ఉండి 'బుట్టతల సాయిబాబా' అంటే నాకే చేరుతుంది. ఎందుకంటే అది నాలో ఉంది. ఎక్కడ అనుకున్నా అది నాకే చెందుతుంది. నాకు ఎదురుగా వచ్చి 'బట్టతల సాయిబాబా' అంటే నాకు సంబంధముకాదు. నాకు బట్టతలలేదు. ఎందుకు వానిపై జగడం చేయాలి? ఇది సత్యమైన మార్గము. నీలో ఏదైనా దోషముంటే వాడు అన్నప్పుడు స్వీకరించవలసిందే! నీలో లేనప్పుడు ఎవరేమనుకున్నా భయపడనక్కరలేదు. అటువంటి నమ్మకము కోల్పోయినారు, యువకులు. ఆ నమ్మకము పెంచుకున్నప్పుడే సంతృప్తి వస్తుంది. ప్రపంచమంతా దూషించనీ నీవు ఏమాత్రము వెరవనక్కరలేదు. ఎందుకంటే నీలో లేని దోషానికి నీవు ఎందుకు భయపడాలి? లోకులు కాకులు. మనము ఏ ఒక్కదానికి ఉద్రేకానికి లోనుకాకూడదు. 'శాంతి, శాంతి, శాంతి' అంటున్నాము. ఎందుకు మూడు పర్యాయములే శాంతి అనాలి? అనగా ఏమిటి? ఆదిభౌతికము, ఆదిదైవికము, ఆధ్యాత్మికము. శరీర, మానసిక, ఆధ్యాత్మిక శాంతి మూడూ కావాలి. ఎందుకంటే, నీవు మూడు స్వరూపాలతో ఉంటున్నావు. You are not one person, but three. The one you think you are, the one others think you are and the one you really are. అదే దేహము, మనస్సు, ఆత్మ. ఈ మూడు విధములైన శాంతి మనకు ఉండాలి. అందుకోసమే మనము మూడు పర్యాయములు చెబుతున్నాము. మూడు పర్యాయములు 'శాంతి, శాంతి, శాంతి' అని ముప్ఫైసంవత్సరములనుంచి చెబుతున్నాము కాని శాంతి ఎక్కడా మనలో లేదు. కేవలం గ్రామఫోను లేక టేపురికార్డరు మాదిరి చెబుతున్నాము. శాంతి అని చెప్పినా నాలో శాంతి ఉందా అని విచారించుకోవాలి. ఎవరితోనో పోట్లాడినాడు. ఆ కోపముతో ఇంటికి వచ్చాడు. భజన చేశాడు. భజనకూడా ఉద్రేకముగానే చేశాడు. కట్టకడపటికి 'శాంతి' పదము వచ్చింది. శాంతి పదము చెప్పడములోనే శాంతి లేదు. ఇంక

srisathyasaivachanamrutam

ఏవిధంగా మనకు శాంతి లభ్యమవుతుంది? ఎలాంటి సమయమునందైనా మాటలు చాలా మృదువుగా ఉండాలి. ఆ మృదుమధురమైన మాటలే మన హృదయాన్ని చల్లబరుస్తాయి. మానవుడు ఉద్రేకమునకు అవకాశము ఇవ్వకూడదు. ఆవేదనకు అవకాశము ఇవ్వకూడదు. మనము కొన్ని అపోహలు మనలో పెంచుకుంటున్నాము. తనలో తాను చింతించుకొని తనకు తానే కోపించుకుంటూ వుంటాడు. దీనికి కారణము దృష్టియొక్క దోషము. శ్రవణ దోషము. మనము పలికే పలుకు దోషము. ఈ మూడింటివలనే ఈ విధమైన దుర్గుణములు, దుర్భావములు, దురాలోచనలు ఆవిర్భవిస్తున్నాయి.

**సమ్యక్ క్రాంతియే సంక్రాంతి**

యువకులారా! విద్యకు సంబంధించిన విషయములుంటే టీవిని చూడండి, నేర్చుకోండి. ఈనాడు టీవిలో చూపించేవి మీ జీవితాన్ని పూర్తిగా పాడు చేస్తున్నవి. పోనీ మీరు ఎప్పుడైనా చూచినా, భోజనము చేసే సమయములో చూడకండి. ఆ టీవిచూస్తూ ఆతృతతో తింటావు. తింటుంటే దానిపై concentration చేయలేదే! కనుక concentration ఎట్లాగుండాలంటే ఏ పని చేస్తున్నావో దానిపైన concentration ఉండాలి. పనిచేసే సమయంలో పనిపైన concentration ఉండాలి. తినే సమయంలో తిండిపై concentration ఉండాలి. మాట్లాడే సమయంలో మాటలపై concentration ఉండాలి. ఏ పనికి ఆ పనిపై దృష్టి పెట్టుకోవాలి. నిజంగా మాట్లాడేవాడు పని చేయలేడు. పనిచేసేవాడు మాట్లాడలేడు. కనుక మనము ప్రతి పనియందు దానిపై లక్ష్యము పెట్టుకోవాలి. అదే మానవుని ప్రధానమైన కాంతి. ఆ కాంతియే మనము సంక్రాంతిగా విశ్వసించాలి. ఆ కాంతి సంవత్సరానికి ఒక్కసారి వస్తుంది అని భావించకూడదు. క్షణక్షణము మనలో సంక్రాంతి రావాలి. 'సమ్యక్ క్రాంతి'యే 'సంక్రాంతి'. చూడండి మీకు తెలుసు, సంగీతము. ఎక్కడో కచ్చేరీ జరుగుతున్నది. ఆ కచ్చేరీలో రాగము, శృతి, తాళములపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. కానీ చెప్పే పదములోని అర్థము ఎవరూ గుర్తించటంలేదు. చివరకు పాడేవాడే గుర్తించటంలేదు. ఎందుకు తాళము, శృతి, రాగము? ఇదియే మన భారతదేశానికి పెద్ద కళ. 'భావ, రాగ, తాళ సమ్మిళితం భారతం' అన్నారు. భా-భావము, ర-రాగము,

sri sathyasai vachanamrutam

త-తాళము ఇదే 'భారత'. మనస్సు, వాక్కు, కాయము. ఈ మూడింటి ఏకత్వము కావాలి మనకు. పదములయొక్క భావముకూడా తెలుసుకోవాలి. పదములలోని భావములు ఎవరూ గుర్తించటంలేదు. అదృష్టవశాత్తు త్యాగరాజు వ్రాసిన తెలుగు పాటలలో ఆంధ్రులు అర్థాలు చక్కగా గుర్తిస్తారు. కారణం, వారు తెలుగు తెలిసిన వారు కనుక. తెలుగు తెలియని తమిళులు మ్యూజిక్‌లో ఉన్నతస్థాయిలో ఉంటున్నారు. అర్థము తెలిసిన ఆంధ్రులకు కర్నాటక సంగీతము అంత తెలియటంలేదు. అర్థము తెలియని తమిళులు కర్నాటక సంగీతము ఉత్సాహంగా పాడుతుంటారు. రెండూ తెలిసిన వారు ఆ సంగీత సభలో ప్రవేశిస్తే తల చెదరిపోతుంది. త్యాగరాజు పాడారు, ఒకానొక సమయంలో. 'నే పొగడకుంటే నీకేమి కొదువ రామా!' అని. 'నిన్ను పొగిడే వారు ప్రపంచములో కోటానుకోట్లు ఉంటున్నారు. నేను పొగడకపోతే తగ్గిపోయేది లేదు. నేను పొగడకుంటే నీకేమి కొదువ' అన్నాడు. ఈ తమిళంలో 'త'కారము, 'గ'కారము, 'ద'కారము, 'క'కారము అంతా ఒక్కటే! వారి తప్పుకాదది. 'నే పకోడా తింటే నీకేమి కొదువ రామా!' అని పాడారు ఒకరు. ఎంత వ్యత్యాసముంటున్నాది! 'పొగడకుంటే', 'పకోడా తింటే!' కనుకనే భావమునకు, తాళమునకు, రాగమునకు తగిన ఏకత్వమును చేయాలి.

**మానవుడు మానవునిగా జీవించాలి**

మీరు విద్యార్థులుగా ఉంటున్నారు. మీరు చదువుకుంటున్నారు. ఏ లక్ష్యముతో చదువుతున్నారు? మీ భవిష్యత్తులో జీవితాన్ని సుఖశాంతులతో అనుభవించాలి. అంతేకాక చదువులో ఉండే అంతరార్థమునుకూడా గుర్తించాలి. అదే సంస్కృతి. పరిపూర్ణంగా తెలుసుకోవాలి. మనము అనేకం ప్రపంచములో చూస్తున్నాము, అనుభవిస్తున్నాము. ఏనాడు టీవీలు, రేడియోలు ప్రారంభమైనాయో ఆనాటినుండి మానవుని హృదయములు మాలిన్యంగా మారిపోతున్నాయి. అయితే వాటిలో తప్పులేదు. ప్రోగ్రాములు చేసేవారిలో ఉంటున్నాది మాలిన్యము. ప్రభుత్వముకూడా సరైన రీతిలో అర్థము చేసుకోటంలేదు. Science & Technology. మనుష్యులను చెడపటానికి ట్రిక్నాలజీ. మనుష్యులను చెడిపేది ఎవరూ ప్రవేశపెట్టకూడదు. యువకుల మనస్సు చాలా కలుషితమైపోయింది. మీరు

sri sathyasai vahanamrutam

భోజనం చేసే సమయంలో టీవిలు చూడకండి. ఇంకే విధమైన సంభాషణలు అధికంగా జరపకండి. ఎవరైనా పలకరిస్తే జవాబు మాత్రమే చెప్పాలి. తల్లితండ్రులకు తగిన గౌరవము ఇవ్వాలి. ఆ రేడియో, టీవీలలో తల్లితండ్రులకు గౌరవము ఇవ్వమని చెప్పడంలేదు. ఒరే పిచ్చివాడా! బాల్యమునందే యవ్వనము, యవ్వనమునందే వార్ధక్యము ఉన్నాది. 'నీవే తాతవు, నీవే తండ్రివి, నీవే కొడుకువు. ఎందుకు గౌరవము ఇవ్వాలి. నేనుకూడా పెద్దవాడిని అయ్యాను, గౌరవాన్ని తీసుకోవాలిగానీ గౌరవాన్ని ఇచ్చేవాడనుగాను', అనుకోకూడదు. ఇది అజ్ఞానము. నీవు ఎంత పెద్దవాడవైనా తండ్రికి కొడుకువేగానీ తండ్రికంటె పెద్దవాడుకాదు కదా! తండ్రికి తగిన గౌరవము ఇయ్యి. తల్లికి తగిన గౌరవము ఇయ్యి. ఇంటికి వచ్చిన పెద్దలను గౌరవించు. పెద్దలు ఇంటికి వస్తే నీమాటికి నీవు టీవి చూచుకుంటే ఇది మంచికి తగిన లక్షణమా? నీవు టీవి చూస్తున్నావు. మీ నాన్నను చూడాలని మీ నాన్న ఫ్రెండు వచ్చాడు. తక్షణమే నీవు టీవిని ఆపుచెయ్యాలి. వారికి వెళ్లి నమస్కరించాలి. ఎందుకు వచ్చారో కారణము తెలుసుకొని తండ్రికి అందించాలి. అబ్బే! ఆ వినయమే లేదు. దొంగలు వచ్చి చేరినా ఈ టీవి వీడు మానడు. దీనిపైనున్న concentration మానవత్వముపైన పెట్టకూడదా! మానవుడై నీవు మానవత్వాన్ని విస్మరిస్తున్నావు. ఈనాటి మానవుడు మానవుడుగా జీవించాలి. ఇంకా ఉత్తమ మానవుడుగా తయారుకావాలి. మానవులం మానవులుగానే జీవిద్దాం. నీవు దైవముకానక్కరలేదు. మానవుడు మానవుడుగా జీవిస్తే నీవే దైవంగా మారిపోతావు.

### నిన్ను నీవు విచారించుకోవటమే ఆధ్యాత్మికతయొక్క అంతరార్థము

దేనిని ఆశ్రయిస్తే ఆశించినది లభ్యమవుతుందో మీరు మొట్టమొదట గుర్తించాలి. నీకు నదులు కావాలి. నదులలో నీరు ప్రవహించాలి. అందుకొరకు నీవు నదులను ప్రార్థిస్తున్నావు. ఇది పెద్ద అజ్ఞానము. వర్షములేక నదులు ఎట్లా వస్తాయి? నీవు వరుణుని అనుగ్రహమునకు పాత్రుడు కాకుండా నదులు ప్రవహించాలంటే ఎలా? అదే రీతిగా అంతః తృప్తి అనుభవించినప్పుడే బహిర్తృప్తి తానంతట అదే లభిస్తుంది. జీవితములో సుఖశాంతులనుభవించాలంటే మొట్టమొదట అంతర్ముఖమైన సుఖశాంతులు

అనుభవించాలి. జగత్తులో ఎన్నో జరుగుతున్నాయి, వినరానివి చూడరానివి. చెడ్డ జరుగుతున్నది అనుకుంటున్నాము. నీవు అది చెడ్డ అనుకున్నప్పుడు ఆ చెడ్డ నీలో లేకుండా చూచుకో. ఎవరు ఏమి చేస్తే అది నీవు మంచిదని భావిస్తున్నావో అది నీవు చేసి చూపించు. ఆ మంచిచెడ్డలు నిర్ణయించే శక్తి నీలో ఉన్నది కదా. అ నిర్ణయం శక్తి నీలో లేకపోతే అది మంచి ఇది చెడ్డ అని ఏ రీతిగా చెప్పగలవు? ఆ విచారణ శక్తి నీలో ఉంటున్నాది. అన్నింటిని విచారణ చేస్తున్నావు. నిన్ను నీవు విచారణ చేయటంలేదు. నిన్ను నీవు విచారించాలి. అదియే ఆధ్యాత్మికతయొక్క అంతరార్థము. ఏ మహనీయుల దగ్గరికి పోయినా 'నిన్ను నీవు తెలుసుకో నాయనా! నీవు ఎవరో నీవు తెలుసుకో!' అని బోధిస్తారు. కాని, అది మరచిపోతున్నారు. కనిపించిన వారినంతా 'మీరు ఎవరండి? ఎక్కడనుంచి వచ్చారు?' అని ప్రశ్నిస్తున్నారు. నీవు ఎవరో, ఎక్కడనుండి వచ్చావో తెలియనప్పుడు వాడు ఎక్కడనుండి వచ్చాడో తెలుసుకొని ఏమి ప్రయోజనము? మొట్టమొదట 'నేను ఎవరు? నేను ఎక్కడనుండి వచ్చాను?' అని విచారించు. ఇదియే శంకరాచార్యులవారు ప్రబోధిస్తూ వచ్చారు. ఒకడు గ్రామరు చదువుచున్నాడు, 'డుకృఞ్ కరణే' అని. అతని దగ్గరకు వెళ్లాడు. 'బాబూ! ఏమి చదువుతున్నావు నీవు?' అని అడిగాడు. 'నేను పాణిని వ్యాకరణము చదువుతున్నాను', అని చెప్పాడు ఆ వ్యక్తి. 'ఈ గ్రామరు వల్ల నీకు లభించే ఫలితము ఏమిటి?' అని మళ్లీ ప్రశ్నించాడు శంకరాచార్యులు. అందుకు అవతల వ్యక్తి 'గొప్ప వ్యాకరణ పండితుడనౌతాను', అని బదులు చెప్పాడు. 'పండితుడు కావటంవలన వచ్చిన ఫలితము ఏమిటి?', అని మళ్లీ ప్రశ్నించాడు. 'రాజ్యసభలలో చేరుతాను. సన్మానములు పొందుతాను, గొప్ప బహుమానములు అందుకుంటాను', అని చెప్పాడా వ్యక్తి. 'అందుకుంటావు, ఆ బహుమానాలవల్ల కలిగే ఫలితము ఏమిటి?' 'నా కుటుంబములో నేను, నా బిడ్డలు సుఖంగా జీవిస్తాము'. 'ఎంతవరకు జీవిస్తావు?' 'చచ్చినంతవరకు జీవిస్తాను'. 'మరణించిన తరువాత ఏమి ఫలితము వస్తుంది' 'అది నాకు తెలియదు' అన్నాడు. బ్రతికినంతవరకు జీవించేది మాత్రమే తెలిసింది అతనికి. అప్పుడు చెప్పాడు, శంకరాచార్యుడు:

**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్ కరణే.**

sri sathyasai vahini vachanamrutam

ఓ మూర్ఖుడా తరువాత నీవు ఏమి పొందుతావో తెలియనప్పుడు నీవు తెలుసుకొని ఏమి ప్రయోజనము? నీవు వంటలు వండుతున్నావు, ఇంటిలో. ఏ విధంగా సద్వినియోగం చెయ్యాలి, వండిన వంట ఎవరికైనా నీవు వడ్డించాలికదా! లేకపోతే ప్రయోజనము ఏమిటి? మూసిపెడితే పాచిపోతుంది. పాచిపోయిన పనికిరాదు. నీవు ఏమి సాధించావు. నీ జ్ఞానాన్ని ప్రపంచానికి ఏ విధంగా సద్వినియోగం చేస్తావు? అదే మూర్ఖత్వమన్నారు, శంకరాచార్యులవారు. అదే రీతిగా మనము చదువుతున్నాము. లేబరేటరీలో గంటలుగంటలు పరీక్షలు చేస్తున్నాము. పరిశీలన చేస్తున్నాము. కానీ జీవితములో ఏమాత్రము సుఖములేదు. ఎవరైనా నిన్ను ప్రశ్నించినప్పుడు గొప్ప సైంటిస్టు అని అనుకుంటావు. వాటర్ ఏ విధంగా లభిస్తున్నాది నీకు? హైడ్రోజన్, ఆక్సిజన్ రెండూ కలిపితే వాటర్ వస్తుందని జవాబు చెబుతావు. కేవలము గ్రంథపరిచయమేగానీ ప్రాక్టికల్‌లో కాదు కదా! లెబరేటరీలో ఆక్సిజన్, హైడ్రోజన్ రెండు చేర్చి వాటర్ చేసినావు. నిత్యజీవితములో ఈ వాటర్ ఏ రీతిగా చూడగలవు? భోజనం చేయడానికి ముందు కూర్చున్నావు. నీవు ఆక్సిజన్ మరియు హైడ్రోజన్ కలుపుకుంటున్నావా? వాటర్ నీకు కావాలి. అదే చదువుకు, సంస్కారమునకు భేదము. హైడ్రోజన్ మరియు ఆక్సిజన్‌తో వాటర్ చేయవచ్చు. ఆ కొద్ది వాటర్‌ను పదిమందికి పంచటమే నీ సంస్కృతి. చేయటం గొప్పతనముకాదు. సద్వినియోగము చేయటం గొప్పతనము. ఈ సద్వినియోగపరచే విధానము మనం గుర్తించాలి. సద్వినియోగపరచటమే సంస్కృతి చేయటమే చదువు. చదువుతోపాటు సంస్కారము ఉంటుండాలి.

**దేశానికి శాంతి అందించటమే విద్యార్థుల కర్తవ్యము**

విద్యార్థులారా! అనేక విధములైన విషయాలు జగత్తులో మీరు చూస్తున్నారు, వింటున్నారు. ఇన్ని విన్నప్పటికి, చూచినప్పటికి మీలో మార్పు లేకపోతే ప్రయోజనములేదు. మీరే ప్రపంచమును తీర్చిదిద్దాలి. బావిభారతపౌరులు మీరే! మీరు సరైన మార్గములో నడచుకొని ప్రబోధించటానికి ప్రయత్నించాలి. విద్యార్థులు, యువకులు, యువతులు మాలిన్యమైన ఈ ప్రపంచాన్ని శుభ్రపరచటానికి తగిన కంకణము కట్టుకోవాలి. చేయగలను

sri sathyasai vachanamrutam

అనే దృఢసంకల్పముతో నడుం కట్టుకొని ముందుకు అడుగువేయండి. నీవు సంపాయించటం గొప్పతనముకాదు. దేశానికి శాంతి అందించటమే గొప్పతనము. దేశములో జరిగే అశాంతిని చల్లార్చటమే గొప్పతనము. దేశములో ఉద్రేకమును శాంతిమయము చేయాలి. అది ఈనాడు విద్యార్థులు చేయవలసిన పని. కానీ అట్టి విద్యార్థులు ఈనాడు భయంకరమైన దృశ్యములను సృష్టిస్తూ వస్తున్నారు. అది సరికాదు. మీరు విద్యార్థులు, ప్రపంచశాంతిని కోరుతూ సమాజముయొక్క సంక్షేమము ఆశిస్తూరావాలి. ఇలాంటి విద్యార్థులుగా మీరు తయారైనప్పుడే ఇలాంటి యువకులుగా మీరు పెరిగినప్పుడే దేశముయొక్క శాంతి చెప్పనక్కరలేదు ప్రశాంతి ఏర్పడుతుంది. మొట్టమొదట మీరు శాంతులు కండి. ఇంటిలో శాంతి ఉండినప్పుడు వీధిలో శాంతి వస్తుంది. వీధిలో శాంతి ఉండినప్పుడు గ్రామములో శాంతి వస్తుంది. గ్రామములో శాంతి ఉండినప్పుడు జిల్లాలో శాంతి వస్తుంది. జిల్లాలో శాంతి ఉన్నప్పుడే రాష్ట్రములో శాంతి వస్తుంది. నీ ఇంటిలోనే శాంతిలేదు. వీధిలోకి ఏ విధముగా పంపగలవు? మొట్టమొదట ఇంటిలోని నలుగురు అన్నదమ్ములు, తల్లిబిడ్డలు, అక్కచెల్లెంద్రు అందరు ఐకమత్యంగా కలసి ఉంటుండాలి. చాలామంది న్యూస్‌పేపరు చదువుతుంటారు. అనేక ప్రబోధలు వస్తుంటాయి, న్యూస్ వస్తుంటాయి.

**ఐకమత్యమే బలము**

మొట్టమొదట ఐకమత్యము సాధించాలి. ఐకమత్యము ఏ విధంగా సాధించాలి? ఐకమత్యముతో సాధించలేనిది ఏది లేదు. ఐదువేళ్లు చేరితే ఎంతపనైనా చేయవచ్చు. ఒక తండ్రికి 5మంది కొడుకులున్నారు. ఆ 5మందికి 'నాయనా! నేను మరణించిన తరువాత మీరందరు ఐకమత్యముగా ఉంటుండి కుటుంబము పేరు కాపాడాలి' అని చెప్పాడు తండ్రి. 'నాన్నా! మేము మరణించేవరకు ఐకమత్యంగా ఉండి ఇంటిపేరు నిలుపుతాము' అని ప్రామిస్ చేశారు. సరే దాన్ని మనస్సులో పెట్టుకున్నాడు తండ్రి. ఒకనాడు కట్టెలమోపు తీసుకుని ఒకడు వచ్చాడు. కట్టెలమోపును గోడకానించి డబ్బు ఇచ్చి పంపించాడు, తండ్రి. ఒక్కొక్క కుమారుని పిల్చాడు, 'నాయనా! కట్టెమోపును తుంచి నీ బలమెంతుందో

sri sathyasai vahamrutam

చూడ'మన్నాడు. ఒక్కొక్కడు వచ్చాడు. చాలా బలము ఉపయోగపెట్టాడు. కట్టెలమోపు త్రుంచలేకపోయాడు. అదే విధంగా 5మందిని పిల్చాడు. 5మంది వచ్చి బలమును ఉపయోగపెట్టి కట్టెలమోపును త్రుంచలేక పోయారు. తరువాత ఒక కట్టె విడిగా తీసి ఒక్కొక్కరిని పిలిచాడు. ఒక్కొక్క కట్టె ఇచ్చాడు. విడిగా ఉన్న కట్టెను క్షణములోపల త్రుంచివేశారు. కట్టెలమోపులోని కట్టెలన్నీ త్రుంచారు. అప్పుడు తండ్రి చెప్పాడు, 'అన్ని కట్టెలు చేరి ఒక మోపుగా ఉంటే ఎవరూ త్రుంచలేరు. ఒక్కొక్క కట్టె విడివిడిగా ఉండినప్పుడు ఎవరైనా త్రుంచగలరు. అదే విధంగా మీ ఐదుమంది ఏకంగా ఉంటే ఎవరు ఏమీ చేయలేరు. విడివిడిగా ఉన్నప్పుడు ప్రతి ఒక్కరు మిమ్మల్ని అసహ్యించుకుంటారు. ఇంకపైన మీరందరు కలసిఉండండి', అని బోధించాడు. అందరు కలసి ఉంటే ఎంతోబలము ఉంటుంది. ఈ బట్టలో ఎన్నో దారాలు చేరాయి. దారములన్నీ చేరటంచేత చించటానికి కష్టమైపోతుంది. ఒక్కొక్క దారము తీయండి రెండువేళ్లతో తెంపవచ్చు. ఐకమత్యమే బలము. ఆచరణయే తగిన గుణము. ఈ ఐకమత్యమును ఆచరణలో పెట్టాలి. అప్పుడే మన దేశము ఆదర్శవంతముగా ఉంటుంది. విద్యార్థిదశ ఆదర్శవంతముగా రూపొందుతుంది. యువకులు ఎక్కడికి వెళ్లినప్పటికి అశాంతికి అవకాశము ఉండదు. అవకాశము వచ్చింది కనుక చెబుతున్నాను. ఈనాడు 5మంది విద్యార్థులు కలసి బజార్లో వెడుతుంటే వంట ఇంట్లో వంట చేసేవారికికూడా వినబడుతాయి, వీరి మాటలు. ఇంత కేకలు వేసుకుంటూ పోతుంటారు. వీరు విద్యార్థులా లేక రౌడీగ్యాంగా? విద్యార్థులు ఎంత ప్రశాంతముగా జీవించాలి? మరొకరికి అశాంతిని అందించకూడదు. మరొకరికి అశాంతినందించకుండా ప్రవర్తించేవారే నిజమైన విద్యార్థి. చాలా గౌరవముగా మర్యాదగా ప్రవర్తించాలి. పెద్దలను గౌరవించాలి, తల్లితండ్రులను ప్రేమించాలి. తోటి మానవులను గౌరవించాలి.

**వేదము ఐకమత్యమును బోధించింది**

దేశభక్తిని పెంచాలి. ఇదే జాతీయతా బలము. 'ఇది నేను పుట్టిన దేశము, నేను దీనిని రక్షించుకోవాలి', అని ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిజ్ఞ తీసుకోవాలి.

**ఇది నాదు మాతృదేశము**

sri sathyasai vahini amrutam

**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మతమం**
**చెదగొట్టి నుడువనేరక**
**బ్రదికిన జీవి యొకడైన ఈ వసుధన్ గలడా!**

'ఇది నా దేశము, నా భాష, నా మతము', అనే భావము లేనివాడు బ్రతికినా శవముతో సమానమే. అది ఉండాలి. నీ దేశమని నీ అభిమానము ఎట్లా ఉందో పరదేశాన్నికూడా అట్లానే చూడాలి. అన్ని దేశములవారు ఐకమత్యముగా ఉంటుండాలి. వసుధైక కుటుంబముగా మారిపోవాలి. ఇలాంటి పరివర్తన తెప్పించేదే సంక్రాంతి. ఈ సంక్రాంతితో మహా శాంతిని పొందాలి. శాంతిని పెంచాలి. ఆకర్షణ చేయాలి. నీ వ్యక్తిగత అసంతృప్తిని ప్రపంచమునకు పంచవద్దు. నీ అసంతృప్తిని, అవేశమును ఇతరులలో నీవు ఏమాత్రము ప్రవేశపెట్టవద్దు. ఏదైనా అశాంతి వస్తే నీలోనే అణచుకో. దానివల్ల మరొకరిని బాధపెట్టటానికి ప్రయత్నము చేయవద్దు. ఇంటిలోనున్నవారిపైకూడా నీకు కోపం రావచ్చును. కానీ దానిని నీవు అణగద్రొక్కుకోవాలి. అ విధమైన ఓపికను పెంచుకోవాలి. దానినే త్యాగరాజు చెప్పాడు, 'శాంతములేక సౌఖ్యములేదు సారసదళనయనా' అని. శాంతములేక సౌఖ్యములేదు. ఎవనికి యీ శాంతి కావాలి? దాంతునికైనా వేదాంతునికైనా! అట్టి శాంతిని ప్రబోధిస్తూ వచ్చింది వేదము, మొట్టమొదట. వేదము ఐకమత్యమును బోధిస్తూ వచ్చింది. ఈనాటి పండితులు ఈ రహస్యాన్ని చెప్పటానికి ప్రయత్నించటంలేదు. అది వారి తప్పుకాదు. వారికే తెలియదు, పాపం ఏమి చేస్తారు? మొట్టమొదట వేదము ఐకమత్యముతో ప్రారంభమైంది. 'సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై....' అందరు కలసిమెలసి ఉండాలి. దానికే

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం**
**కలసిమెలసి కలిమి చెలిమి బలము గుణము పెంచుదాం**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**

అని వేదము మొట్టమొదట ప్రబోధించింది. అందరు కలసిమెలసి ఉండాలి.

srisathyasaivachanamrutam

అన్నదమ్ములయందైనా ద్వేషము రావచ్చు. కానీ, విద్యార్థులలో రాకూడదు. ఇలాంటి విద్యార్థులు ప్రపంచములో ప్రవేశించి ఈనాడు ప్రపంచమును బాధించే అశాంతిని మీరు ప్రశాంతిగా మార్చాలి.

**అతిభాష మతిహాని, మితభాష అతిహాయి**

మితభాషణము పెంచుకోండి. అతిభాష మనకు అక్కరలేదు. అతిభాష మతిహాని. మితభాష అతిహాయి. అతితిండి మతిహాని. మితతిండి అతిహాయి. కడుపునిండుకు తింటే ఏమి పని చేయగలవు? ఇంకా తినవచ్చు అనే భావము వచ్చేవరకు మాత్రమే తిను. అతిగా తింటే పనిచేయలేవు. ఏమీ సాధించలేవు. కనుక, మితంగా మాట్లాడండి. మితంగా తినండి. అమితంగా ఆనందించండి. ఏ పనియందుగానీ భగవన్నామాన్ని మరచకుండా ఉండండి. ఈనాడు సంక్రాంతియందలి ప్రధానమైన అంతరార్థము మన హృదయమునందు పరివర్తన రావాలి. మనలో శాంతిని అభివృద్ధిపరచుకోవాలి. కాంతిని పెంచుకోవాలి. ఆ పెంచుకున్న కాంతిని, శాంతిని ప్రపంచమునకు పంచాలి. వ్యక్తిగతమైన సుఖము ఏమాత్రము సుఖముకాదు. ప్రపంచములోనివారంతా నావారే, నా బంధువులే అనే భావాన్ని పెంచుకోవాలి. ఇలాంటి అనంతత్వాన్ని బోధించేదే సంక్రాంతి.

**(తేదీ 15-01-1996న పూర్ణచంద్రలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam